క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాల్ సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకుభక్తుల రద్దీ కొనసాగింది. మొహర్రం నెల 40 రోజులు పూర్తి కావడంతో గురువారం దర్గాకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కర్నూలుజిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు దర్గాకు తరలివచ్చారు. దర్గాలో ఫాతెహాల్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మండలమీట్

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే మండల మీట్‌కు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయ, విద్యుత్, గ్రామీణ గృహ నిర్మాణ శాఖ, పశుపోషణ, మాతా శిశుసంక్షేమ, రెవెన్యూ, ఉపాధి తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

నేడు బిజనవేములలో జ్యోతుల మహోత్సవం



జ్యోతులకు ముస్తాబైన చౌడేశ్వరీదేవి ఆలయం

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈమేరకు గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయం ముస్తాబైంది. గ్రామంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు గురువారం అర్ధరాత్రి జ్యోతులతో భక్తులు ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయనున్నారు. జ్యోతుల సందర్భంగా గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

హిజ్రాలకు కౌన్సెలింగ్

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో వ్యాపారుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న హిజ్రాలకు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇతర ప్రాంతాలకు చెందిన పది మందికి పైగానే హిజ్రాలు గురువారం కొలిమిగుండ్లలో వ్యాపారుల నుంచి రూ.500 నుంచి మొదలు కొని వెయ్యి రూపాయలు పైగానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వ్యాపారులు అయోమయానికి గురయ్యారు. కొందరు ఏకంగా దుకాణాలు మూసేసి ఇళ్లకు వెళ్లిపోయారు. వ్యాపారులు విషయాన్ని ఎస్‌ఐ దృష్టికి తీసుకెళ్లడంతో హిజ్రాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బలవంతపు వసూళ్ల తగదని, దాతలు ఇచ్చినంత తీసుకోవాలని హెచ్చరించారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపల పెద్ద అల్లి (63) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సంజామల మండల వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి తదితరులు పసుపల పెద్దఅల్లి మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కొలిమిగుండ్ల: ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి చెప్పారు. లారీలతో పాటు ఇతర వాహనదారులు రాత్రి వేళల్లో సుదీర్ఘ ప్రయాణం చేయడం మూలంగా నిద్ర మత్తులో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలు నివారించేందుకు గురువారం తెల్లవారు జామున కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు జంక్షన్‌లో స్టాప్.. వాష్..గో కార్యక్రమంలో భాగంగా తెల్లవారు జామున 2 నుంచి 4 గంటల వరకు రాకపోకలు సాగించే వాహనాల డ్రైవర్లను ఆపి నీటితో ముఖం కడుక్కునేలా చేశారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేలా తగు సూచనలు ఇచ్చారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



అవుకు: మారేమడుగులలో వ్యక్తికి రక్త పరీక్ష చేస్తున్న ఎమ్ఎల్‌హెచ్‌పి శ్రీలేఖ



బనగానపల్లె: పట్టణంలోని నాల్గవ సచివాలయ పరిధిలోని మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



సంజామల: ఆల్వకొండ గ్రామంలో వైద్యాధికారి నాగదాసు సమక్షంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం మాణిక్యమ్మ



డోన్: పట్టణంలో వ్యక్తికి బీపీ పరిశీలిస్తున్న దృశ్యం

బనగానపల్లె డోన్: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వే బనగానపల్లె, డోన్ నియోజకవర్గాలలో ముమ్మరంగా సాగుతోంది. ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబీ, డెంగీ, మలేరియా, టీబీ తదితర పరీక్షలు నిర్వహించి ఆయా వ్యక్తుల వివరాలను నమోదు చేస్తున్నారు. అదేవిధంగా ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక మెడికల్ క్యాంపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు ప్రత్యేక మెడికల్ క్యాంపుల్లో వైద్య నిపుణులు అందజేసే సేవలు వివరిస్తూ సద్వినియోగం చేసుకోవాలని సూచనలు చేస్తున్నారు ఆరోగ్య, వైద్య సిబ్బంది. అవుకు మండలంలో ఇంటింటి సర్వేలో భాగంగా 7500 మందికి వైద్య పరీక్షలు చేశామని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



రూ. 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వల్లంపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ. 30 లక్షలతో తాగునీటి పైప్‌లైన్, రూ. 25 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, రూ. 5 లక్షలతో ఏర్పాటు చేసిన డ్రైనేజీ పనులను గురువారం ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటా సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలకతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తే రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తుందన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు, తదితర పథకాలను వర్తింపచేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిని వివరించామన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. ఆ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించామని వివరించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఓబుళపతిరెడ్డి, ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీవీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దరామిరెడ్డి, పుల్లారెడ్డి, శివారెడ్డి, తిరుపతయ్య, దినకర్, మద్దిలేటి, గుండమయ్య, వెంకటేష్ నాయుడు, ఎల్‌బీసీ రామసుబ్బారెడ్డి, హరినాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, లక్ష్మినారాయణ, ప్రభాకర్‌రెడ్డి, పొట్టిపాడు శ్రీనివాసరెడ్డి, నాగార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్డీ రాధిక, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చెంచయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షిర్డీసాయి గ్రామోత్సవం



సాయిబాబా విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీషిరిడీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

అవుకు: శ్రీ సాయిబాబు 188వ జయంతి వేడుకలను పురస్కరించుకొని అవుకు మండలం రామాపురం గ్రామంలో గురువారం స్వామివారి గ్రామోత్సవం భక్తులు భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ఆలయంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలకంకరించి ట్రాక్టర్‌పై గ్రామపుర వీధుల్లో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పిస్తూ ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తుల కోలాటం ఆకట్టుకుంది.

ఘనంగా శ్రీ షిరిడి సాయి జయంతి

బనగానపల్లెరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ షిరిడీ సాయిబాబా మందిరాల్లో శ్రీసాయినాథ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. యాగంటిపల్లె రహదారిలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీషిరిడీ సేవా ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో బాబా వారికి ఉదయం కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకం, మధ్యాహ్నం మధ్యాహ్న హారతి నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయిగురు శ్రీనివాసులు సత్సంగ ప్రసంగాలు చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్నిప్రారంభిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి,ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలి, మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్ రెడ్డి, నాగరాజు పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని మెయిన్ స్కూలు ఆవరణలో మత సామరస్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ ప్రారంభించారు. 76 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు మారుతి కృష్ణ, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, మతసామరస్య చైతన్య వేదిక సభ్యులు నూర్ అహ్మద్, గౌస్, జయంత్ గౌడ్, అబ్దుల్ ఖాదర్, దస్తగిరి, రెడ్ క్రాస్ మండల చైర్మన్ నాగ సురేంద్ర, లైఫ్ సభ్యులు రవి, విజయేంద్రారెడ్డి, షేక్షావలీ, అక్బర్ హుసేన్, శ్రీను పాల్గొన్నారు.

కందకాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం



కందకం దగ్గర సర్వే చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: కందకాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. పట్టణంలోని కోటపేట, డ్రైవర్స్ కాలనీ సమీపాన ఉన్న కందకంలో రూ.3.70 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి నగర పంచాయతీ చైర్మన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. కందకం చుట్టూ చేపట్టే అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, ఈఈ పబ్లిక్ హెల్త్ గంగాధర్, ఏఈలు సురేష్, శేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కోవెలకుంట్ల సీఐ

బనగానపల్లెరూరల్ : కోవెలకుంట్ల సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలను స్వీకరించిన రామాంజులు గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాటసానికి సీఐ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి సహకారం కావాలన్న తప్పక అందిస్తామన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మంచి సేవలందించి మన్ననలను పొందాలని సీఐకి సూచించారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి క్రికెట్ కిట్లను ఉచితంగా అందజేశారు. స్థానిక స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓబులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయులు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంట్టెన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర సమావేశానికి హాజరు కావాలి

నంద్యాల(అర్బన్): కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే వాహన మిత్ర సమావేశానికి నంద్యాల జిల్లా ఎండీయూ (మొబైల్ డిస్పెన్సన్ యూనిట్) ఆపరేటరు హాజరు కావాలని జిల్లా అధ్యక్షుడు ఖాజా శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఎండీయూలను వాహన మిత్రలో చేర్చడం పట్ల కృతజ్ఞతలు తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

రెచ్చి పోతున్న అల్లరి మూకలు

డోన్ టౌన్ : పట్టణంలో మద్యం మత్తులో అల్లరి మూకలు రెచ్చిపోతున్నాయి. వినాయక నిమజ్జనం సందర్భంగా స్థానిక ఇందిరానగర్‌లో రెండు వర్గాల యువత గొడవ పడిన సందర్భాన్ని మరిచి పోకముందు పాతపేటలో కొంత మంది ఒక కుటంబంపై దాడికి పాల్పడగా శేగు థియేటర్ సమీపంలో మరికొందరు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో రెండు బైకులను ధ్వంసం అయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాతపేటకు చెందిన షేక్ చాంద్ బాషా కుటంబపై పాత కక్షలు మనసులో ఉంచుకుని బుధవారం రాత్రి ఇమ్రాన్, బాలు, మధు, షేక్షావలితో పాటు మరికొంత మంది రాళ్లు కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో చాంద్‌బాషాతోపాటు కుమారులైన హుస్సేన్ తలకు, బాషాకు స్వల్ప గాయాలు అయినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విధంగా శేగు థియేటర్ సమీపంలోని షేక్ మౌలాలి అనే వ్యక్తితో బలిజ రాము, వినోద్, అరవింద్, బాలుతో పాటు మరికొందరు గొడవపడ్డారు. మౌలాలికి సంబంధించిన బుల్లెట్, హోండా హెచ్‌ఎఫ్ డీలక్స్ బైకులను ధంసం చేశారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజేష్ తెలిపారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ప్రతి వార్డులో ప్రాధాన్యత క్రమంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20లక్షలు మంజూరయ్యాయన్నారు. మూడవ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మంజూరైన రూ.10లక్షలతో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పూజారి వెంకటేశ్వరమ్మ, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, నాయకులు వంశీకృష్ణ, మేకల హరి పాల్గొన్నారు.

30 చలో విజయవాడ

డోన్ టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడ కార్యాక్రమానికి విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి అశోక్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై గత నెల21వ తేదీ నుండి ఈ నెల 1వ తేది వరకు జిల్లాలోని 29 మండలాలు తిరిగి విద్యార్థులు సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు వేణుమాధవ్, శ్రీనివాసులు, ఆకాష్, గిడ్డయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ నాయకులు

ప్యాపిలి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన పలువురు ఉపాధ్యాయులను గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. డోన్ ఎన్. ఎన్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తొగట సురేశ్ బాబు, పీఆర్ పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులుకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అజాం బేగ్, ఉపాధ్యక్షుడు వెంకటనాయక్, సీపీఎస్ కన్వీనర్ చిన్నపరెడ్డి, ఎస్టీయూ నాయకులు చంద్రమౌళి తదితరులు ఉత్తమ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

భగత్ సింగ్ అడుగు జాడల్లో నడవాలి



భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్ : స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు మహబూబ్‌బాషా, అశోక్‌లు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 116వ జయంతిని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ ఉరి కంభం ఎక్కిన ధైర్యంతుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, పవన్ కుమార్ గౌడ్, రాజశేఖర్, రామలింగడు, గోపాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, ఆకాష్, వేణుమాధవ్, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం భగత్ సింగ్ చూపిన ధైర్యంతో ఉద్యమించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా అధక్షుడు పవన్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని పురష్కరించుకొని స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో గురువారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బేతంచెర్ల: సమాజ అభివృద్ధి కోసం సంఘ సంస్కర్తలు చేసిన సేవలు చిరస్మరణీయం అని శేషారెడ్డి వైద్య శాల సూపరిండెంట్ సాగరిక అన్నారు. గురువారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య శాల సూపరిండెంట్ సాగరిక అధ్యక్షతన కుక్కకాటుకు వ్యాక్సిన్ కనుగొన్న డాక్టర్ లూయి పాశ్చర్ వర్ధింతి, విప్లవ కెరటం భగత్‌సింగ్, మహా కవి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బేతంచెర్ల: భగత్ సింగ్ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల సాధనకు ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని గురువారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులు ఎల్లక్రిష్ణ, ప్రదీప్, శ్రీకర్, దిలీప్, నక్క మధు, హరి, శివ పాల్గొన్నారు.

డోన్ రూరల్ : భగత్ సింగ్ స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో యువత ప్రధాని నరేంద్రమోడీని ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ లెనిన్‌బాబు, సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్ రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య పిలుపు నిచ్చారు. స్థానిక నక్కిరామన్న భవనంలో గురువారం సర్దార్ భగత్‌సింగ్ 116 వ జయంతిని బొంతిరాళ్ల గ్రామ సర్పంచ్ రవిమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, మోటారాముడు, సుగుణమ్మ, ప్రభాకర్, అబ్బాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలి



సయ్యద్ అబ్దాల్ సాహెబ్ కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని



బేతంచెర్లలో ఆసర్ పేటలో ప్రార్థనా గీతాలు ఆలపిస్తున్న దృశ్యం



మిలాద్ ఉన్‌నబీ సందర్భంగా విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



రక్తదానం చేస్తున్న షాధిఖానా కమిటీ సభ్యులు

బనగానపల్లెరూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని గురువారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభకాంక్షలు తెలుపుకుని స్వీట్స్ పంపిణీ చేశారు. పట్టణంలో పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న జెండేవాలే సాహెబ్ దర్గా వద్ద ముస్లిం మతగురువు సయ్యద్ అబ్దాల్ సాహెబ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిని పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని సంఘీ భావం తెలిపారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, సైకిల్‌షాపు మహబూబ్‌వలి, రోబో, ఖానిక్, సురేష్, కలాం తదితరులు ఉన్నారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో ముస్లిం సోదరులు మహ్మద్ ప్రవక్త జయంతి మిలాద్- ఉన్-నబీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని ఆసర్‌పేట కాలనీలో మండల ఖాజీ నూర్‌అహ్మద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్‌ప్రవక్త కేశాలను భక్తుల సందర్శనార్థం ఉంచారు.

సమస్యలు పరిష్కారిస్తాం

బనగానపల్లె : బనగానపల్లె కూరగాయాల మార్కెట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కూరగాయాల హోల్‌సేల్ వ్యాపారి, మాజీ మండల ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కూరగాయాల మార్కెట్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా హోల్‌సెల్, రిటైల్ వ్యాపారులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకోచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో వర్షాకాలంలో మార్కెట్ లో తీవ్ర ఇబ్బందిగా ఉండేదని, మార్కెట్ మొత్తం సీసీ రోడ్డు వేయించామని గుర్తు చేశారు. అదేవిధంగా మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేసి మహిళలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా ఎమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహబూబ్‌బాషా ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే కాటసాని పాల్గొన్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయకులు షాభీర్, రెహమాన్, జాకీర్, కలాం, గౌండవలి తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా కమిటీ సభ్యులు రక్తదానం

డోన్ : మిలాదున్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా స్థానిక షాదీఖానా కమిటీ సభ్యులు రక్తదాన చేశారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు దస్తగిరి, పారిశ్రామికవేత్త ఖాజాల నిర్వహణలో కర్నూలు బ్లడ్‌బ్యాంక్‌కు స్థానిక షాధిఖానలో ఏర్పాటు చేసిన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. అనంతరం పాతబస్టాండ్, అమ్మ హోటల్ ప్రాంతాల్లో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మెకానిక్ హుసేన్, ఖాదర్, మహబూబ్ బాషా, షఫిద్దీన్, అన్వర్, నాజర్, కొండపేట రఫి, రబ్బాని, షఫిద్దీన్, ముజ్జు, హరీఫ్, అక్బర్, అజీజ్, షాధిఖాన రాజా, రహంతుల్లా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.